Maryam Jameela se Ek Interview
(Telugu)

# మర్యమ్ జమీలా

# .... ఇంటర్వ్యూ ....


మూలం:

**అబ్బాస్ అఖ్తర్ ఎవాన్**

అనువాదం:

**ఇఖ్బాల్ అహ్మద్**



**తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్ (రిజి)**

సందేశభవనం, లక్కడ్ కోట్,

హైదరాబాద్-500 002. ఫోన్: 24564583

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడయిన అల్లాహ్ పేరుతో

# మర్యమ్ జమీలాతో ఒక ఇంటర్వ్యూ

అది 1962వ సంవత్సరం ఆరంభ కాలం. ఒక 27 ఏళ్ళ అమెరికన్ యువతి ఒంటరిగా న్యూయార్క్ నుండి పాకిస్తాన్‌కు బయలుదేరింది. ఒక గ్రీకు ఓడలో ఆరు నెలల నిరంతర ప్రయాణం చేసి అలెగ్జాండ్రియా, పోర్ట్ సూడాన్, జిద్దాల మీదుగా కరాచీ చేరగానే చిత్తశుద్ధి, విశ్వాసపరమయిన సంబంధంగల సోదర సోదరీమణులు పెద్ద సంఖ్యలో ఆమెను స్వాగతించ డానికి రెడీగా వున్నారు. జమాఅతె ఇస్లామీ కార్యకర్తలయిన వీరు, ప్రస్తుత యుగంలో కేవలం అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (సఅసం) పేరు మీద తన దేశాన్ని, తల్లిదండ్రుల్ని, ఆప్తుల్ని విడిచిపెట్టి పాకిస్తాన్‌కు హిజ్రత్ చేస్తున్న తమ నవ ముస్లిం సోదరీమణిని, తమ స్వంత కుమార్తెనో, కోడలినో స్వాగ తిస్తున్నట్లుగా ఉద్వేగభరిత స్వాగతం పలుకుతున్నారు.

ఈ 27 ఏళ్ళ నవ ముస్లిం స్త్రీ పేరు గౌరవనీయ మర్యమ్ జమీలా. తదుపరి కాలంలో ఆమె 33 పుస్తకాల రచయిత్రిగా, ఇస్లామీయ ప్రపంచం లోని గొప్ప మేధావిగా గణతికెక్కింది. ఆమె తండ్రి హెర్బర్ట్ మార్కోస్ సిడ్నీ మరియు గ్రాడ్యుయేట్ అయిన తల్లి జర్మన్ నస్తాద్ యూదు మహిళ. వారి పూర్వీకులు ఒకానొకప్పుడు ఉపాధి విస్తరణా మార్గాల అన్వేషణలో అమెరికాకు వచ్చారు. అక్కడే వారు స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. అమెరికాలో ఉన్న యూదులలో అధిక భాగం రష్యన్ సంతతికి చెందినవారే. వారు రష్యా నుండి తరిమివేయబడినవారు. కాని మర్యమ్ జమీలా (పూర్వనామం మార్గరెట్ మార్కోస్) కుటుంబం మాత్రం తమ ఇష్టపూర్వకంగా స్వదేశాన్ని వీడిన యూదులలోని వారు. మర్యమ్ జమీలా తన తల్లిదండ్రులకు రెండవ కుమార్తె. ఇస్లాం స్వీకార మజిలీని చేరుకోవడానికి ఆమె ఎన్నో దశలను

దాటవలసి వచ్చింది. సన్ డే స్కూలు తర్వాత సంస్కరణావాదులైన యూదుల సంస్థకు అనుబంధమైన ఒక స్కూలులో విద్యనభ్యసించారు. ఆ తర్వాత న్యూయార్క్ యూనివర్శిటీలో చేరారు. కాని అనారోగ్య కారణాల వల్ల మరుసటి సంవత్సరమే విద్యాభ్యాసం మానుకోవాల్సి వచ్చింది. సంస్కరణా వాదులయిన యూదుల ఉద్యమంలో చేరారు. కాని యవ్వన ఆరంభంలో దాని పట్ల కూడా రోత కలిగింది. తర్వాత బహాయీ ఉద్యమంతో సంబంధం ఏర్పడింది. మిర్జా అహ్మద్ సెహరాబ్ దానికి నాయకుడు. సంవత్సరం గడవక ముందే ఆ వర్గం పట్ల కూడా గౌరవం తగ్గిపోసాగింది. దాని తర్వాత జియోనిస్టు ఉద్యమ సభ్యురాలయ్యారు. దాని పేరు "మిర్జా షీహాత్ జేర్." దానితో కూడా త్వరగానే తెగతెంపులు చేసుకున్నారు. క్రైస్తవాన్ని అధ్యయనం చేయగా బైబిల్లో.......కథలలో పొంతనలేని కథనం తప్ప మరేమీ కనబడలేదు. విస్తృతమయిన ఈ పఠనం చివరికి ఇస్లాం మజిలీ వరకూ నడిపించింది. ఆమె మార్మడ్యూక్ పిక్ థల్‌గారి మీనింగ్ ఆఫ్ ది ఖుర్ఆన్, ముహమ్మద్ అసద్‌గారి ఆత్మకథ "Rood ka Makkah" అధ్యయనం చేశారు. ఇమామె గజాలీ గారి "అహ్యాయె ఉలూముద్దీన్, ముఖద్దమ ఇబ్నె ఖుల్దూన్, అల్ హిదాయ, అల్లామా ఇఖ్బాల్‌గారి గేయాలు చదివారు. మౌలానా మౌదూదిగారి 'రిసాలె దీనియాత్, ఇస్లాం కా నజరియా హయాత్, ఇస్లామీ రియాసత్ ఔర్ ఇస్లాం ఔర్ ఖౌమియత్ కూడా చదివారు. ఆ తర్వాత ఇస్లాం మరియు పాశ్చాత్య నాగరికత అన్న అంశంపై స్వయంగా వ్యాసాలు వ్రాయడం ఆరంభిం చారు. ఆమె రచనలు బ్రిటన్, టర్కీ, స్విట్జర్లాండ్, దక్షిణాఫ్రికా, సిలోన్, ఇండియా, పాకిస్తాన్‌లలోని ఇంగ్లీష్ మ్యాగజైన్‌లలో ప్రచురిత మయ్యాయి. ఆ తర్వాత ఆమె పరిచయం విస్తృతమవుతూపోయింది. మార్గరెట్ మార్కోస్ ముస్లిం ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలోని ఉలేమాలతో కూడా ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి పరిచయాలు పెంచుకున్నారు. వారిలో అల్జీరియా ఉలే మాల నాయకుడు షేఖ్ ఇబ్రాహీమీ, డాక్టర్ అల్ బహారుల్ అజ్‌హరీ (ఈజిప్టు), డాక్టర్ ముహమ్మద్ లతీఫ్ జాల (వాషింగ్టన్), డాక్టర్ ముహమ్మద్ హమీదుల్లా (పారిస్), డాక్టర్ సయీద్ రమజాన్ (డైరెక్టర్ ఇస్లామిక్ సెంటర్, జెనీవా),

ఇంకా మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూదీ (రహ్మాలై)తో ఉత్తర ప్రత్యుత్త రాలు జరిగేవి. మౌలానా మౌదూది పేరిట వ్రాసిన లేఖలో ఆమె ఇలా వ్రాశారు:

"నేనొక 26 సంవత్సరాల అమెరికన్ యువతిని. ప్రపంచంలోని ఏకైక ఆశ్రయం, ఆశాభావం అయిన 'ఇస్లాం' పట్ల అపారమయిన ఆసక్తి కలదాన్ని. ఇప్పుడు నా తాత ముత్తాతల మతం అయిన 'యూదు మతాన్ని' వదలి, ఇస్లాం స్వీకరించగోరుతున్నాను."

మార్గరెట్ మార్కోస్, మౌలానా పేరిట వ్రాసిన మొట్టమొదటి ఉత్తరం ఇది. 1960, డిసెంబర్ 5వ తేదీన వ్రాయబడింది. ఆమె ఇస్లాం వైపుగా కొనసాగిస్తున్న ప్రయాణాన్ని మౌలానా ప్రోత్సహించారు. ఫలితంగా ఆమె 1961, మే 24న ఇస్లాం రక్షణలోకి వచ్చారు. కాని ఇస్లాం స్వీకరించిన తరువాత ఒక ముస్లిం మహిళగా తన ఉనికిని కాపాడుకోవడానికి అమెరికన్ సొసైటీలో ఆమె ఎదుర్కొన్న కష్టాలు ఆమెను ఎంతో నిరుత్సాహపరచే విధంగా ఉండేవి. ఆ పరిస్థితుల వైనాన్ని మరొక లేఖలో వివరించగా, మౌలానా ఇలా వ్రాశారు:

"మీరు ప్రస్తుతం వుంటున్న సమాజం, మీ దృష్టిలో వున్న విధంగా (ఒక ముస్లింగా) మిమ్మల్ని ఎంత మాత్రం అంగీకరించదు. పైగా మీలో వున్న ప్రతి సుగుణాన్నీ లోపంగా భావించడం జరుగుతుంది."

కొన్నాళ్ళ తర్వాత మౌలానా, ఆమెను పాకిస్తాన్ రమ్మని ఆహ్వానించారు. ఒక కుమార్తెగా ఆమె భవిష్యత్తులోని అన్ని బాధ్యతలనూ స్వీకరించగలనని వాగ్దానం చేశారు. అందుచేత కొన్ని నెలల తర్వాత ఆమె పాకిస్తాన్‌కు వచ్చేశారు. మర్యమ్ జమీలా ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారుల తల్లి. ఆమె తన పిల్లల్ని ఇస్లామీయ ఉద్యమ కార్యకర్తలుగా తీర్చిదిద్దాలన్న కోరికను వెల్లడించి అందుకోసం దుఆ చేశారు. ఆమె ప్రార్థనలు వృథా కాలేదు. ఆమె కుమారు లిద్దరూ ఇస్లామీ జమీయతె తలబాలో క్రియాశీలక సభ్యులుగా వున్నారు. కొన్నాళ్ళ క్రితమే అఫ్ఘానిస్తాన్ కూటమి నుండి వచ్చారు. బి.ఎ. విద్యార్థిని అయిన చిన్న కుమార్తె ఇస్లామీ జమీఅతె తాలిబాత్‌తో అనుబంధం ఏర్పరచు కున్నారు. మర్యమ్ 33 పుస్తకాల రచయిత్రి. ఆమె రచనలు, సంకలనాలలో

కొన్ని ముఖ్యమయిన వాటి పేర్లు ఇవి: బచ్‌పన్ ఔర్ షబాబ్‌కీ యాదే, దావతె ఇస్లామీ (తల్లిదండ్రుల పేరిట బహిరంగ లేఖ)లో నేను ఇస్లాం పట్ల ఎందుకు ప్రభావితురాలిని అయ్యాను?, ఇస్లాం ఔర్ జిద్దత్ పసందీ, ఇస్లాం బముఖాబిల అహ్‌లుల్ కితాబ్ (మాజీ ఔర్ హాల్‌కే ఆయినేమె) ఇస్లాం-ఓరియంటలిజం, ఇస్లాం ఏక్ నజరియ, ఏక్ తహరీక్, క్యా మగ్రిబీ తహజీబ్ ఆఫాఖీ హై?, షేఖ్ ఉస్మాన్ డాన్ ఫోదియో (దక్షిణ ఆఫ్రికాకు చెందిన గొప్ప ముజాహిద్) ఇటీవలి గతంలోని అరబ్ ప్రపంచంలోని గొప్ప ఇస్లామీయ ఉద్యమాలు, షేఖ్ హసనుల్ బన్నా మరియు ఇఖ్వానుల్ ముస్లిమీన్, టర్కీ లోని గొప్ప ఇస్లామీయ ఉద్యమం, మౌలానా మౌదూదీ ఔర్ మర్యమ్ జమీలా కే దర్మియాన్ ఖత్ వ కితాబత్, ఇస్లాం ఫేస్ టు ఫేస్ త్రూది కరంట్ క్రైసిస్, ఇస్లామిక్ కల్చర్ ఇన్ థియరీ అండ్ ప్రాక్టీస్, హోమ్ ఇన్ పాకిస్తాన్ 1962-1984, ఇస్లాం ఇన్ థియరీ అండ్ ప్రాక్టీస్, ఇస్లాం అండ్ వెస్ట్రన్ సొసైటీ, ఫేమిలీ లైఫ్ ఇన్ ఇస్లాం వగైరా. అమెరికన్ పౌరసత్వం కలిగిన మహిళ ఇస్లాం స్వీకరించిన రోజు నుండే అమెరికన్ మరియు యూరోపియన్ నాగరికతను వ్యతిరేకించసాగింది. ఈ పోరాటం, కొత్త సంతతి భద్రత మరియు ఇస్లాం రక్షణ కోసం. విచిత్రమేమంటే పాకిస్తాన్ ప్రభుత్వం, ఇస్లాం మరియు పాకిస్తాన్‌ల గొప్ప సేవకురాలి పట్ల ఉదాసీన ధోరణి అవలంబించింది. ధర్మరాహిత్య దృక్పథం గల రచయితలనయితే ప్రోత్సహించడం జరుగుతోంది. కాని ఇస్లాం కోసం పనిచేస్తున్న నవ ముస్లిం మహిళకు ప్రభుత్వ స్థాయిలో యోగ్యతా పత్రంగానీ, పతకమూ పురస్కారంగానీ ఇవ్వబడలేదు. ఏ సాహిత్య సభ కూడా ఈ విషయంలో చొరవ తీసుకోలేదు. పశ్చిమాన్నుండి బయలుదేరి వచ్చిన ఒక మహిళ పాశ్చాత్య నాగరికతలో జీవితం కొనసాగిస్తోంది. మరి మనం ఇప్పటికీ దాని ఊబిలోనే చిక్కుబడి వున్నాం. ఎంత విడ్డూరకరం! ప్రభుత్వస్థాయిలో కేవలం ఒక్కసారి ఆమెను కలుసుకోవడం జరిగింది అది, అయ్యూబ్ ఖాన్ పరిపాలనా కాలంలో. ఒక ఉన్నతాధికారి ఆమెతో, ఇస్లాం కోసం మీరు చేస్తున్న వాలంటరీ సేవల్ని మేము గౌరవిస్తున్నాం అని అనడంతో సరిపెట్టుకున్నారు.

గౌరవనీయురాలయిన మర్యమ్ జమీలా రచనలు ప్రపంచంలో పలుచోట్ల చదవబడుతున్నాయి. యూదు మతం నుండి ఇస్లాం వైపునకు వచ్చిన మహిళ, ఇస్లాం సేవ, రక్షణ, ప్రచురణ కోసం రచనా రంగంలో కూడా అమూల్య సేవలు అందించడం అనేది ఇస్లాం చరిత్రలో ఏకైక ఉదాహరణ. ఆమె ఇస్లాం సత్యతను చాటిచెప్పే సందేశదాత మాత్రమేకాక యూదులు, క్రైస్తవుల ఇస్లాం వ్యతిరేక పన్నాగాలను పోస్ట్‌మార్టం కూడా చేస్తున్నారు. పదకొండు ఏళ్ళక్రితం ప్రస్తుత జమాఅతె ఇస్లామీ పాకిస్తాన్ అమీరు అయిన ఖాజీ హుసైన్ మలేషియా పర్యటనకు వెళ్ళినప్పుడు, మలేషియాలో ఇస్లామీయ ఉద్యమంతో సంబంధంగల మహిళలు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో మర్యమ్ జమీలా గారి పుస్తకాల పట్ల ప్రభావితులయ్యారనీ, అక్కడ ఆమె పుస్తకాలను ఆసక్తితో చదువుతారని ఇంకా మర్యమ్ జమీలా వచ్చి తమ వద్ద ఉండాలని, తద్వారా తాము నేరుగా ఆమె వల్ల లబ్ధిపొంద వచ్చునని మలేషియా మహిళలు తమ ప్రగాఢ వాంఛను వ్యక్తం చేశారు.

గౌరవనీయురాలయిన మర్యమ్ జమిలా దాదాపు 29 ఏళ్ళ నుండి (1992 నాటికి) లాహోర్‌లోని ప్రాచీన బస్తీ ఇస్లాంపురలో నివసిస్తున్నారు. ఇక్కడే ఆమెతో వివరంగా ఇంటర్వ్యూ జరిగింది. ఇంటర్వ్యూ కోసం మేము ఆమె యింటికి వెళ్ళినప్పుడు ఆమె పర్దా చాటున కూర్చుని స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియాకు చెందిన ఒక నాయకునితో సంభాషణలో నిమగ్నమయి ఉన్నారు. అనువాదం కోసం జనాబ్ ముహమ్మద్ యూసుఫ్ ఖాన్‌గారు కూడా అక్కడే వున్నారు. మా ప్రశ్నలు వివరణాత్మక సంభాషణను కోరుతున్నాయి. అది ఒక సిట్టింగులో సాధ్యం కాదు. అందుచేత వ్రాతపూర్వకం గానూ, సంభాషణాపరంగానూ ఆమెతో జరిపిన ఇంటర్వ్యూ వివరాలు ఈ క్రింద ఇవ్వబడుతున్నాయి.

**ప్రశ్న: మీ బాల్యం, విద్యాభ్యాసం, దాని తర్వాతి దశలో (ఇస్లాం స్వీకారానికి ముందు) మీ కార్యకలాపాలు ఎలా వుండేవి? మీరు వాటిని కొస్త వివరంగా ప్రస్తావిస్తే కృతజ్ఞులం.**

**జవాబు:** బాల్యం నుండి యవ్వనం వరకూ న్యూయార్క్‌లో గడిచింది. కేవలం అమెరికన్ నాగరికత, హుందాతనంతో కూడిన సామాజిక హోదాగల మా కుటుంబం, నేరాలకు దూరంగా, విజయవంతమైన దాంపత్య జీవితం, యువజనుల మానసిక ఆరోగ్యం, కుటుంబంలో పరస్పర ప్రేమానురాగాలు వగైరా విషయాల రీత్యా ప్రసిద్ధమయింది.

నాకు చిన్నప్పటి నుండే, ముఖ్యమయిన, గొప్ప గొప్ప పనుల్ని చేయాలన్న ఆసక్తి వుండేది. నా జీవితంలో అన్నింటికన్నా పెద్ద కోరిక, నా మరణానికి ముందు, నా జీవితం లక్ష్యరహితంగా, పాపకార్యాలలో గడచి పోలేదని నాకు నమ్మకం కుదరాలి అన్నదే. నా చిన్ననాటి సంఘటనే ఇది. ఒకసారి మా నాన్నగారు చెప్పిన మాటలు విని ఆందోళన చెందాను. "జీవితం విలువల్లో ఏదీ కూడా తప్పనిసరి అయినదీ, దీర్ఘకాలికమయినదీ కాదు. నిన్ను నీవు కాలానుగుణంగా మలచుకో. ఇదే విజయ రహస్యం" అని ఆయన అన్నారు. ఆ రోజుల్లో నేను చావు అంటే ఎంతో భయం కలిగి వుండేదాన్ని. కొన్ని సందర్భాలలో రాత్రి నిద్రలో లేచి కూర్చుని తల్లిదండ్రుల్ని మేల్కొలిపేదానిని. నేను ఏ విధంగా మరణిస్తాను. మరణానంతరం ఏమవుతుంది? అని ప్రశ్నించేదాన్ని. వారు మరణం తప్పనిసరి విషయం అని అనడంతోపాటు ఆధునిక విజ్ఞానం, అభివృద్ధి చెందిన కారణంగా నా వయస్సు వంద ఏళ్ళు కూడా కావచ్చని ఆశాభావం కలిగించే వారు. కాని ఇది నా కోరిక అన్వేషణ కాదు. సదాచరణ ఎన్నటికీ వృథా కాదు అన్న వాస్తవం ఖుర్ఆన్ ద్వారా మాత్రమే లభించింది. ఇందుకు ప్రతిఫలం ఈ ప్రపంచంలో లభించవచ్చు. కాని పరలోకంలో ఈ ఆచరణ తప్పక సఫలమవుతుంది.

చిన్నప్పుడు మ్యూజిక్ పట్ల మంచి ఆసక్తి కలదాన్ని. ప్రత్యేకించి, పాశ్చాత్య దేశాలలో ఉన్నత సాహిత్యానికి ప్రతీకలుగా భావించబడుతున్న పాటలు. స్కూల్లో కూడా నాకు ఇష్టమైన అంశం మ్యూజిక్కే. అందులో ఎప్పుడూ నాకు మంచి మార్కులు వచ్చేవి. 11 ఏళ్ళ వయస్సులో ఒకసారి రేడియోలో అరబీ పాట వినడం జరిగింది. ఆ పాట నాకెంతగా నచ్చిందంటే,

దాన్ని రెండవసారి విని తీరాలనుకున్నాను. ఆ తర్వాత నా మనసులో పాశ్చాత్య సంగీతం పట్ల గౌరవం నశించింది. అందువలన అరబీ మ్యూజిక్ రికార్డులు తెమ్మని నా తల్లిదండ్రుల్ని బలవంతపెట్టనారంభించాను. అందుచేత ఒక రోజు మా తండ్రిగారితో న్యూయార్క్‌లోని షామీ మొహల్లా నుండి ఎన్నో రికార్డుల్ని ఖరీదు చేశాను. అందులో ఒకటి ఉమ్మె కుల్సుమ్ రికార్డు కూడా వుంది. అందులో సూరయె మర్యమ్ పారాయణం (తిలావత్) కూడా వుంది. దాని శ్రావ్యమయిన స్వరం నన్ను బాగా ఆకర్షించింది. (ఉమ్మె కుల్సుమ్ భవిష్యత్తు ఎంత అంధకారపూరితమైనదో ఆమె విషయంలో అంచనా వేయలేకపోయాను).

నేను ఒక పబ్లిక్ స్కూలులో విద్యాభ్యాసం చేశాను. నాకు యూదుల చరిత్ర పట్ల ఆసక్తి గాఢంగా వుండేది. కాని యూదులకు తమ ధర్మం పట్ల సౌమనస్యం లేకపోవడం నాకు విచారం కలిగించింది. వారు ఆరాధనా లయాల్లో, ఆరాధనా సమయంలో కూడా పుస్తకాలు తిరగేసి జోక్స్ చదువుతూ వుంటారు. స్వయానా మా యింటి వాతావరణమే ధర్మానికి దూరంగా వుండేది. నేను సండే స్కూలులో ఉన్నప్పుడు నా సోదరి స్కూలుకు వెళ్ళడానికి ఎంతో కష్టంగా అంగీకరించేది. వాస్తవానికి మా తల్లిదండ్రులు మా స్కూలును కూడా మార్చారు. ఆ తరువాత ఒక సంస్కరణా సాహిత్య సంస్థకు చెందిన స్కూలులో ప్రవేశం లభించింది. పదిహేనేళ్ళ వయస్సులో ఇక్కడి చదువు పూర్తి చేశాను. నేను చదివిన స్కూళ్ళు అన్నింటిలోనూ క్రమశిక్షణ మాత్రం చెప్పుకోదగ్గది. కాని మతం పట్ల అనుబంధం లేదు. సాహిత్యం, చరిత్ర, సైన్సు, ఆర్ట్, లెక్కల గురించి ప్రతి విషయమూ నేర్పుతారు. కాని మతం గురించి ఏమీ నేర్పరు. అయినా నేను నా తల్లిదండ్రుల ప్రోత్సాహం, నా అన్వేషణ, పఠనం కారణంగా అన్నీ నేర్చుకున్నాను. 18 ఏళ్ళ వయస్సులో న్యూయార్క్ యూనివర్శిటీలో వుండగా జబ్బుపడిన కారణంగా చదువుకు ఫుల్‌స్టాప్ పెట్ట వలసి వచ్చింది. దీర్ఘకాల అస్వస్థత కారణంగా తిరిగి చదువు కొనసాగించడం జరగలేదు.

నా బాల్యం ఎన్నో సౌకర్యాలతో, సంతోషంతో గడిచిపోయింది. కాని యవ్వనం ఆరంభం అయిన తర్వాత రొటీన్‌కు భిన్నంగా నేను ఇతరుల్ని కలుసుకోవడాన్ని మానుకున్నాను. నేను విషయలోలతతో కూడినది, సౌమ్యత లేనిది, అట్టడుగు స్థాయిది, కృత్రిమమయినదిగా భావించిన ప్రతిదానినీ ద్వేషించసాగాను. థియేటర్, సినిమా, రేడియో, టి.వి.ల పట్ల ఆసక్తి లేకపోయింది. సంగీతం, నాట్యం, కళలు, పాశ్చాత్య సాహిత్యం మొదలగు వాటికి చాలా దూరంగా వున్నాను. సంపదను ప్రదర్శించడం సాధ్యమయినంత మేరకు మానుకున్నాను. నా ఈ పోకడల కారణంగా యవ్వన దశ ఆరంభం నుండే. 28 ఏళ్ళ వయస్సులో పాకిస్తాన్‌కు వచ్చేవరకూ అమెరికాలో సాంఘిక పరంగా సమాజానికి తగినట్లుగా లేను. నా క్లాస్‌మేంట్స్ ఫేషనబుల్ దుస్తులు, నగలు, అలంకరణలు, మిశ్రమ (స్త్రీ, పురుషుల) పార్టీలు, స్త్రీ పురుషుల డాన్సులు, టూర్లు, రోమాన్స్‌లో మునిగి తేలేవారు. నేను కచ్చితంగా వాటన్నింటికీ దూరంగా వున్నాను. నా శీలాన్ని కళంకం నుండి కాపాడి వుంచుకో వటమేకాక, పురుషులతో అన్నిరకాల సంబంధాలకు దూరంగా వున్నాను. మద్యపానం, సిగరెట్లు కాల్చడం కూడా ఎన్నడూ చేయలేదు. సాధ్యమయి నంతగా అన్ని విధాలా సాధారణమైన స్త్రీ సహజమయిన లజ్జావ్రీడలకు తగిన దుస్తులనే ధరించే దానిని. నేనొక సౌమ్యమయిన మనోమస్తిష్కాలుగల, ఎప్పుడూ పుస్తకాల గుట్టలో నిమగ్నమయి వుండే కన్యను.

నా ఈ తరహా చింతనల కారణంగా నేను ఎటువంటి ఉద్యోగాన్ని పొందలేదు. ఇలా నేను భౌతికతత్వ నాగరికతలో నా ఉనికిగల అవకాశాల్ని తగ్గించివేస్తూపోయాను. స్వయంగా మా కుటుంబ సభ్యులే నేను సన్నగా, నాజూగ్గా తయారవడానికి తగిన ఆహారం వాడాలని, అలంకరణలతో, సింగారించుకొని ఆకర్షణీయంగా తయారవ్వాలని కోరారు. కాని ఇదంతా నా స్వభావానికి విరుద్ధం. నేనందుకు నిష్కర్షగా తిరస్కరించాను. ఇటువంటి ఆలోచనా ధోరణితో నాకు అమెరికాలో ఉండే అవకాశం లేకపోయింది. అందువల్ల దైవలీల నన్ను పాకిస్తాన్‌కు తీసుకువచ్చింది. పాకిస్తాన్ వాతావరణం

కూడా పాశ్చాత్య నాగరికతా ప్రభావానికి లోనవుతూ ఉన్నప్పటికీ ఇక్కడ మంచి ముస్లింలకు కొదువలేదు. వారి కారణంగా ఇక్కడ ఇస్లామీయ బోధనల ప్రకారం జీవించగల వాతావరణం లభిస్తుంది. నేను కొన్ని సందర్భాలలో ఇస్లాం అవసరాలన్నింటినీ పూర్తి చేయలేకపోయేదాన్ని. కనుక వెంటనే ఈ పరిస్థితిని మార్చడానికి యోచించేదాన్ని.

27 ఏళ్ళ వయస్సులో ఇస్లాం స్వీకరించినప్పుడు, పవిత్రమైన వస్త్ర ధారణను అవలంబించాను. తల్లిదండ్రుల సంతృప్తి కోసం ఉపయోగిస్తూ వచ్చిన లిప్‌స్టిక్, స్ప్రే తదితర వస్తువుల వాడకం మానివేశాను. అమెరికాలో మా వాతావరణంలో తీవ్రమయిన ఒత్తిడి కారణంగా బురఖా ఉపయోగించలేక పోయాను. పాకిస్తాన్ చేరిన తర్వాత బురఖా ధరించసాగాను. "ఇక ఇప్పుడయితే బురఖా లేకుండా నన్ను నేను దిగంబరినైనట్లు భావిస్తున్నాను. ఇస్లాం ఇతర మతాల కన్నా ఆధిక్యత సాధించడానికి ఒక కారణం ఇది కూడా వుంది. సిగ్గుమాలినతనం, వ్యభిచారాలనేకాక వాటి దరిదాపులకు పోయే కారణాలను అంతం చేసింది. నాకు నూతన జీవితం పట్ల సంతోషించదగ్గ విషయం, పాశ్చాత్యుల దృష్టిలో ద్వేషభావంతో చూడబడుతున్న స్త్రీ సంబంధమైన ప్రవర్తన, గుణగణాలకు కూడా ఉన్నత స్థానం ఇవ్వబడింది."

**ప్రశ్న: ఇస్లాం వైపు మరలాలన్న కోరిక ఎప్పుడు, ఎలా కలిగింది?**

**జవాబు:** నేను చిన్నప్పటి నుంచే అరబ్బుల గురించిన పుస్తకాల పట్ల ఆసక్తిగలదాన్ని. ఏదన్నా దొరికిందంటే దాన్ని వెంటనే చదివేస్తాను. అరబ్బుల పట్ల ఆసక్తికి అసలు కారణం, వారికీ, యూదులకూ గాఢమయిన చారిత్రక సంబంధాలు వుండేవి. నేను ఇస్లాంను అరబ్బుల ఉపకారంగా భావించేదాన్ని. అయితే ఆ తర్వాత వ్యవహారం అందుకు భిన్నమయిందన్న వాస్తవం వెల్లడయ్యింది. ఆ తర్వాత ఇస్లాం గురించి వీలయినంత ఎక్కువగా తెలుసుకోవాలన్న కోరిక కలిగింది.

ఇలా క్రమంగా నేను ఇస్లాంకు దగ్గరగా, యూదు మతానికి దూరం అవుతూ వచ్చాను. 20 ఏళ్ళ వయస్సులో న్యూయార్క్ యూనివర్శిటీలో నా

ఐచ్ఛిక సబ్జెక్ట్ పేరు, "ఇస్లాంలో యూదత్వం." ఇందులో ఇస్లాం వాస్తవానికి యూదత్వం నుండి గ్రహించబడింది అని స్పష్టం చేయబడింది. ఈ పుస్తకం వైరుధ్యాల పుట్ట. దానితో యూదు మతం పట్ల నా భావన మరింత మసకబారింది.

ఇస్లాం ఒడిలోనికి రావడానికిగల మరో కారణం, మా యింట్లో, పాలస్తీనాపై అరబ్బులకు గల హక్కును నేను సమర్థించినప్పుడల్లా అంతులేని అసూయను ప్రదర్శిస్తూ, నా ధోరణిని తీవ్రంగా గర్హించడం జరిగింది. ఈ పోకడ మా తల్లిదండ్రులకేకాక ప్రతి యూదుడు, జియోనిస్టుకూ ద్వంద్వ పోకడ అయ్యింది. ఈ పోకడ కారణంగా నేను యూదత్వ పరిధి నుండి బయటపడసాగాను.

ఇస్లాం గురించి పఠనం మొదటి నుండే కొనసాగుతున్నప్పటికీ, ఆచరణాత్మకంగా ఇస్లాం వైపు పయనం 8 సంవత్సరాలపాటు కొనసాగింది. ఎంతో శ్రద్ధగా గమనించిన తర్వాతే ఇది జరిగింది. ఇస్లాంను అధ్యయనం చేసిన తర్వాత, ఇస్లాం కేవలం జీవిత అవసరం మాత్రమేకాక స్వయంగా జీవితమే ఇస్లాం అని నాకు తెలిసొచ్చింది. ఈ భావన, ఈ ఆలోచన పెరగడానికి మార్మడ్యూక్ పిక్థాల్ వ్రాసిన ఖుర్ఆన్ అనువాదం, మార్టిన్ లిన్‌గిజ్ పుస్తకం 'ముహమ్మద్', ప్రఖ్యాత ప్రాచ్య విద్యా నిపుణుడు ముహమ్మద్ అసద్ గారి 'ఇస్లాం దో రాహే పర్' అన్న పుస్తకం ప్రస్ఫుట పాత్ర వహించాయి. కొన్ని ముస్లిం దేశాలకు వెళ్ళివున్న కొందరు పెద్దలు కూడా నా ఈ భావనల్ని ధృవపర్చారు. ఇస్లామీయ బోధనల ప్రకారం ఒక మహిళ బయట వుండేకన్నా తన కుటుంబానికి దగ్గరగా వుండటం వలన పరువుగల స్థానం, ఆధ్యాత్మిక గుణగణాలు కలదిగా నిర్ధారించబడుతుందని వారు తెలియజేసినప్పుడు, ఇస్లాం వైపునే మొగ్గుదల అధికమయ్యింది. నేను ఇస్లాం స్వీకరించాలని నిర్ణయించుకున్నప్పుడు మా తెగకు చెందిన గొప్ప బోధకుడు ఇస్లాం ఇతర మతాలకన్నా యూదు మతానికి బాగా దగ్గరగా వుందని అన్నాడు.

**ప్రశ్న: ఇస్లాంను అధ్యయనం చేసిన తరువాత ఏయే వాస్తవాలను గ్రహించారో వాటిని గురించి ఏ మాటలలో వెల్లడిస్తారు?**

**జవాబు:** ప్రపంచంలో ఏకైక మతం ఇస్లాం మాత్రమే తన పవిత్రతను, ఆరోగ్యాన్ని నిలబెట్టుకుంది. ఇతర మతాలలో సత్యత అసంపూర్తిగా లేక పాక్షికంగా వుంది. కాని ఇస్లాం నేటికీ తన సంపూర్ణ బోధనలు, ఆదేశాలతో ఉనికిలో వుంది. వాటిల్లో మానవుని వ్యక్తిగత వ్యవహారాలతో పాటు సామూహిక జీవనం వరకూ సంపూర్ణ మార్గదర్శకత్వం వుంది. ఇస్లాం జీవితంలోని ప్రతి కోణంలో దారిచూపుతుంది. సెక్యులరిజాన్ని అంతం చేస్తుంది. వ్యక్తిని సమాజంతో అనుసంధానం చేస్తుంది. ఇది వ్యక్తిని ఒక దృఢమైన వ్యక్తిత్వంలా మలుస్తుంది. ఇది అతడ్ని దైవదాస్య హక్కును చెల్లించే, ధర్మరాహిత్య, వ్యర్థ విషయాలకు దూరంగా వుండగోరుతుంది. ఇస్లాం ప్రకారం మానవ జీవిత లక్ష్యం తమ ఆచరణ ద్వారా కేవలం అల్లాహ్ సమ్మతి పొందే ప్రయత్నం చేయడం. ఇది కేవలం ఖుర్ఆన్ సున్నత్‌ల అనుసరణ ద్వారానే సాధ్యం. ఈ కారణం వల్లనే ఇస్లాంను అనుసరించే వారిలో ఆత్మహత్యల ఆచూకీ దొరకదు. నిజమయిన ముస్లిం ప్రపంచంలో మిక్కిలి పరాక్రమశాలి అయిన వాడవుతాడు. దైవం తప్ప ప్రతి శక్తి పట్ల నిర్భీతి కలవాడవుతాడు. అదృష్టంపై నమ్మకం కలవాడవుతాడు. సమయానికంటే ముందు గాయ పడటం గానీ, మరణించడంగానీ జరగదని అతడికి గట్టి నమ్మకం వుంటుంది. ఈ నమ్మకమే అతడికి ధైర్యం, శక్తి, ఉత్సాహాలకు కారణభూతమవుతుంది.

ఇస్లాం ముస్లిమేతరులకూ ప్రశాంత జీవనానికి అవకాశాలను కల్పిస్తుంది. వారి ఆరాధనా హక్కును అంగీకరిస్తుంది. ముస్లింలకు వ్యతిరేకంగా తీవ్రమయిన చర్యలలో పాలుపంచుకున్న ముస్లిమేతరుల పట్ల కూడా జిహాద్ సందర్భంగా న్యాయంగా వ్యవహరించాలని తాకీదు చేయబడింది. ఇస్లాం భాష, వర్ణ, వంశ, వర్గ, ప్రాంతీయ, జాతీయ, సాహిత్య, సామాజిక స్థాయిలోకాక విశ్వాసం ప్రాతిపదికగా మానవులను విభజిస్తుంది. సామాజిక సుస్థిరతకు పునాదులు అయ్యే సంబంధాలను, బంధనాలను ఇస్లాం సుదృఢం, సుస్థిరం చేస్తుంది. ఇస్లాం దృష్టిలో మానవ సమాజానికి పునాది కుటుంబం. అందు చేతనే అది వివాహం ప్రాముఖ్యతను, అవసరాన్ని స్పష్టం చేసింది. సన్యాసత్వాన్ని గర్హించింది. అది వివాహం తప్ప అన్ని రకాల లైంగిక సంబంధాలను

అంతం చేస్తుంది. అందుకు తీవ్రమయిన చట్టపరమయిన శిక్షలను విధిస్తుంది. ఈ లక్ష్యం కోసమే సిగ్గు, బిడియం, సౌజన్యత, గౌరవాలను కొనసాగించడాన్ని నొక్కిచెపుతూ దిగంబరత్వం, అశ్లీలతల రూపుమాపబడింది అన్న భావన ఇస్లాం అధ్యయనంతోపాటు రోజురోజుకీ పెరుగుతూపోయింది.

ఇస్లాంలోని ఈ సత్యత, గొప్ప బోధనలు నేను ఇస్లాం వైపు మరలడానికి కారణమయ్యాయి. ఈ ఉజ్వల సిద్ధాంతాలే నన్ను తమ వైపునకు లాక్కున్నాయి. ఆధునిక ప్రపంచ సమస్యలన్నింటికీ పరిష్కారం ఇస్లాంలో వుందని నా అంతఃకరణ సాక్ష్యమివ్వసాగింది. ముస్లిమేతర ప్రపంచాన్ని ఇస్లాం వైపు ప్రోత్సహించడానికి ఇస్లాం ఈ వాస్తవ పరిచయాన్ని సర్వవ్యాప్తం చేయవలసిన అవసరం వుందని నేను భావిస్తున్నాను.

**ప్రశ్న: ఖుర్‌ఆన్‌తో మీ సంబంధం ఎలాగ ఏర్పడింది? ఈ గ్రంథం మీ జీవితంలో ఎలాంటి విప్లవాన్ని రేకెత్తించింది?**

**జవాబు:** ఇది ఆగస్టు 1952 నాటి మాట. అనారోగ్య కారణంగా నా విద్యాభ్యాసానికి అడ్డుకట్ట పడింది. ఒక రోజు మా అమ్మ పబ్లిక్ లైబ్రరీకి వెళ్ళే ముందు నన్ను ఏదయినా పుస్తకం తెచ్చిపెట్టనా అని అడిగింది. నేను ఖుర్‌ఆన్ ప్రతిని తెమ్మని చెప్పాను. ఒక గంట తర్వాత నేను ఖుర్‌ఆన్ పఠనంలో వున్నాను. ఇది ఒక క్రైస్తవ పండితుడు, ప్రచారకుడు అయిన జార్జ్ సీల్ చేసిన ఖుర్‌ఆన్ అనువాదం. ఇందులో పనికిమాలిన పురాతన భాషతో పాటు, క్రైస్తవ దృక్పథంతో మూలాన్ని వికృతపర్చే ప్రయత్నం సాధ్యమయినంతగా చేయబడింది. అందువలన ఆ అనువాదంతో ఖుర్‌ఆన్ గురించి ఏమీ తెలుసుకోలేకపోయాను. ఆ రోజుల్లో నా చుట్టూ వున్న వాతావరణం, అపరిపక్వత కారణంగా ఖుర్‌ఆన్‌ను తౌరాత్ గాధల, వికృతపర్చబడిన, మార్పులు చేర్పులు చేయబడిన స్వరూపమేనని భావించేదాన్ని. అప్పటికి నా వయస్సు 19 ఏళ్ళు. మొత్తం మీద నేను ఖుర్‌ఆన్ పఠనాన్ని కొనసాగించాను. కొన్నాళ్ళ తర్వాత నాకు ఒక షాపులో పిక్థాల్, ఖుర్‌ఆన్ అనువాదం దొరికితే దాన్ని కొన్నాను. ఈ ఖుర్‌ఆన్ అనువాదం నా కోసం కొత్త ద్వారం తెరచినట్లయింది.

దాని ముందు మాటలో పిక్థాల్ ఇలా వ్రాశారు: ఈ అనువాదం ఉద్దేశ్యం, ఆంగ్లభాషా పాఠకుల ఎదుట, ప్రపంచ ముస్లింలు ఖుర్ఆన్ పదాల నుండి ఏ భావాన్ని గ్రహిస్తారు అన్న విషయం వారి ముందు ఉంచదలచాను. ఏదైనా దివ్యవాణి లేక ఆకాశ గ్రంథాన్ని, ఆ దివ్య బోధనలు, వాటి సందేశం పట్ల నమ్మకంలేని వ్యక్తి ఉత్తమ రీతిలో వివరించజాలడు. ఒక ఆంగ్ల ముస్లిం చేసిన మొట్టమొదటి ఆంగ్ల అనువాదం. ఇంతకు ముందు కొన్ని వ్యాఖ్యానాలు ఇష్టం వచ్చిన రీతిలో చేయబడ్డాయి. అవి ఇస్లాం అనుయాయులకు ఎంతో మనఃక్లేశాన్ని కలిగించాయి. దానికితోడు భాష కూడ తగని భాష.

వాస్తవానికి ఖుర్ఆన్‌ను అనువదించడం అసాధ్యం. నేను ఈ గ్రంథాన్ని ఉత్తమ శైలిలో అందించాను. సమంజసమయిన భాషను ఉపయోగించే ప్రయత్నం చేశాను. కాని దీనిని ఖుర్ఆన్ అనువాదం అని చెప్పలేము. ఎందుకంటే అది నిరుపమానమయినది. దానిలో ఎంతటి సామరస్యం ఉందంటే ప్రజలు దానిని వినగానే కన్నీరు కారుస్తారు, పరవశించిపోతారు.

ఆ తరువాత నేను ఆస్పత్రిలో చికిత్స పొందినంత కాలం ఈ అనువాదం నా అధ్యయనంలో వుంది. దైవం పిక్థాల్ ఆత్మను సంతోషపెట్టు గాక! అతడి ఖుర్ఆన్ అనువాదం, ఆంగ్ల భాషా వర్గానికి ఖుర్ఆన్ పఠనం సులభతరం చేసింది. తరువాత నాకు మిష్కాత్ (హదీసు గ్రంథం) చదివే అవకాశం లభించింది. దానివల్ల, హదీసుల పఠనం చేయకుండా ఖుర్ఆన్‌ను అర్థం చేసుకోవడం అసాధ్యం అని వెల్లడయింది. ఈ గ్రంథ పఠనం, ఖుర్ఆన్, దైవవాణి అన్న నా నమ్మకం పరిపూర్ణ విశ్వాసంగా మారిపోయింది.

ఖుర్ఆన్ నాకు విస్మరించజాలని పాఠం నేర్పింది. ఈ ప్రపంచంలో ఎవరికీ శాశ్వతత్వం లభించదు. జీవితంలో మనం మన చుట్టూ విజయం గురించి ఏర్పరచుకున్న పరిస్థితి మరణ ద్వారం వరకూ వచ్చి తెగిపోతుంది. కేవలం ప్రభువు ఆరాధన మాత్రమే మనిషికి సంతృప్తిని, ప్రశాంతతను చేకూరుస్తుందని నేను సాక్ష్యమిస్తున్నాను. మరణం తర్వాత వాస్తవమైన ఉనికికి ఇదే కారణం. మనం మన మిత్రులు, పెద్దల వెంట స్వర్గంలో శాశ్వతంగా

వుంటామన్న ఈ శుభవార్త ఎంత గొప్పది! ఖుర్‌ఆన్ అంటోంది, దైవసాన్నిధ్యం ఎల్లప్పుడూ ఉల్లాసాన్ని ప్రసాదిస్తుంది.

**ప్రశ్న: అమెరికాలో మీ కుటుంబ వాతావరణం ఎలా వుండేది? ఆర్థిక సమస్యలు ఇంట్లో అశాంతికి కారణమయి చివరకు యూదు మతానికి దూరం కావడానికి కారణం అవలేదు కదా!**

**జవాబు:** లేదు. అలాంటిదేమీ లేదు. నేను అమెరికన్ తరహా జీవిత విధానంలో కలిసిపోయిన కటుంబంలో కళ్ళుతెరచాను. న్యూయార్క్ గ్రామ సీమల్లో నివసించే, ఉత్తమ సంప్రదాయాలుగల ఈ యూదు కుటుంబం ఆర్థికపరంగా కూడా సంపన్నమయినదే. ప్రపంచంలోని అవసరమయిన వస్తువులు కూడా అన్నీ అమరాయి. చక్కని ఆరోగ్యం, రుచికరమయిన భోజనం, విశ్రాంతి చేకూర్చే వసతి, కుటుంబ సభ్యులలో పరస్పర ప్రేమానురాగాలు, మంచి మిత్రుల సహచర్యం అన్నీ వున్నా కూడా అదొక నాస్తిక కుటుంబం. వారు దైవాన్నే నాస్తికునిగా చేశారు. వారి జీవితంలోని ఆఖరి మజిలీ ఏమయివుంటుంది అన్న విషయం కూడా వారికి తెలియదు. మరణానంతరం శిక్ష, బహుమనాలను వారు తిరస్కరిస్తారు. నా తల్లిదండ్రులు విశ్వసించే విషయం, అన్ని చెడుగులూ వున్నప్పటికీ ఆధునిక నాగరికత అన్ని నాగరికతలకన్నా మేల్తరమయినది, మానవులు అభివృద్ధి సాధించే ఏకైక మార్గం. శిక్ష, బహుమానాలు కేవలం ఐహిక ప్రపంచం వరకే పరిమితమయినవని వారనేవారు. కాబట్టి జీవితంలో ఉత్తమ సిద్ధాంతం, సంతోషంగా వుండండి. జీవితంలోని సుఖసంతోషాలను ఆస్వాదించే ప్రయత్నం చేయండి. మరణం గురించిన ఆలోచనకు ఏ మాత్రం మనసులో చోటివ్వకండి. కుటుంబాన్ని ప్రేమించండి. బంధుమిత్రులతో సంబంధాలు పెంపొందించండి. అమెరికాలో అపారమయిన వినోదాల్ని ఎంజాయ్ చెయ్యండి అన్నది వారి థియరీ. జీవితం గురించి కృత్రిమ భావనల్ని కలిగివున్నారు. కాని నేను చేదు అనుభవం ద్వారా ఈ ధోరణి సరయింది కాదని, పైగా అది కలతలు, విచారం, ఆందోళనలకు మూలకారణం అయిపోతుందని గ్రహించాను.

**ప్రశ్న: ఇస్లాం స్వీకరణ విషయంలో తల్లిదండ్రులు, బంధువుల తరపు నుండి వ్యతిరేకత ఎదురయ్యిందా?**

**జవాబు:** నా తల్లిదండ్రుల తరపున, నేను ఇస్లాం స్వీకరించకుండా నిరోధించే ప్రయత్నం ఎంతగానో జరిగింది. 1954 నాటి సంగతి. నేను ఇస్లాం స్వీకరించదలచుకున్నప్పుడు ఇస్లాం స్వీకరించినందువల్ల నా జీవితం ఎన్నో ఇబ్బందులకు గురవుతుందని వారు నన్ను వారించారు. ఎందుకంటే ఇస్లాం, యూదుత్వం, క్రైస్తవం వలె అమెరికన్ వాతావరణంలోని భాగం కాదు. ఇంకా ఇస్లాం నన్ను నా కుటుంబం నుండి దూరంగా, సోదరులతో సంబంధం లేకుండా చేసివేస్తుందని చెప్పబడింది. అందుచేత ఈ ఒత్తిడిని ఎదుర్కోలేక పోయాను. టెన్షన్‌కు గురయి జబ్బు పడ్డాను. తర్వాత పరిస్థితులు చదువును మాన్పించాయి. ఆ తర్వాత రెండేళ్ళు ఇంట్లోనే ట్రీట్‌మెంట్ జరిగింది. 1957 నుండి 1959 వరకు ప్రయివేటు మరియు ప్రభుత్వ ఆసుపత్రులలో చికిత్స పొందాను. ఈలోపు, దైవం గనక స్వస్థత ప్రసాదిస్తే ఇస్లాం స్వీకరిస్తానని శపథం చేసుకున్నాను. అందుచేత ఆస్పత్రి నుండి డిశ్చార్జి అయినప్పుడు న్యూయార్క్‌లో ముస్లింల అన్వేషణకు బయలుదేరాను. త్వరలోనే ముస్లిం స్త్రీలతో సంబంధాలు ఏర్పడ్డాయి.

నేను ఇస్లాం స్వీకరించిన తరువాత, ఇది పాశ్చాత్య తరహా జీవితంలో ఇమిడిపోయిన వ్యక్తుల పట్ల వ్యతిరేక భావాల పర్యవసానం అని, వెర్రితనం అన్న అభిప్రాయం వ్యక్తం చెయ్యబడింది. కాని, ఇది వ్యక్తులతోకాక, పాశ్చాత్య నాగరికతలన్న పేరు పెట్టబడిన ఆ వ్యవస్థపై తిరుగుబాటుగా నేను స్పష్టం చేశాను. అట్టడుగు స్థాయి గల, అల్పమయిన, కృత్రిమ విలువలు గల ఆ వ్యవస్థపై నేను తిరుగుబాటును ప్రకటిస్తున్నాను. నాకు వ్యక్తులపట్లకాక, ఇటువంటి నీతిబాహ్య సమాజానికి జన్మనిచ్చిన వ్యవస్థపట్ల ఇంకా మనుష్యులకు, మృగాలకూ మధ్యగల వ్యత్యాసాన్ని తుడిచిపెట్టిన ఆ వ్యవస్థను నేను ద్వేషిస్తున్నాను. అందులో కేవలం తాత్కాలిక సంతోషం, ఆనందాన్ని అనుభవించడమే మిగిలివుంది. అది ఇతరుల విలువపై అయినా సరే. సాధ్యమై

నంత వరకు సంతోషాన్ని అనుభవించడమే అన్న సిద్ధాంతం ప్రాముఖ్యతను సంతరించుకుంది.

దేవుని దయవలన ఇదంతా ఎలావున్నా నా తల్లిదండ్రులు నేను ఇస్లాం స్వీకరించిన తర్వాత కాస్తంత దూరదృష్టితో వ్యవహరించి, మౌలానా మౌదూదీ (రహ్మాలై) చిత్తశుద్ధి, బుద్ధికుశలత, పుణ్యశీలతను విశ్వసించి, నన్ను మౌలానా గారి బాధ్యతపై పాకిస్తాన్‌కు పంపారు. నేను పాకిస్తాన్‌కు వచ్చిన తర్వాత నా తల్లిదండ్రులు రెండుసార్లు పాకిస్తాన్‌కు వచ్చారు. ఉత్తర ప్రత్యుత్త రాలు నిరంతరాయంగా కొనసాగాయి. నా ఇస్లాం స్వీకారాన్ని వ్యతిరేకించి నప్పటికీ ఇది జరిగింది. కాని ఇస్లాం స్వీకరించిన తర్వాత కూడా నాపై వారి వాత్సల్యంలో లోటు రానీయలేదు.

**ప్రశ్న: మీరు మీ తల్లిదండ్రులను ఇస్లాం వైపు ఆహ్వానించారా? అందుకు వారి ప్రతిస్పందన ఎలా వుంది?**

**జవాబు:** అవును. ఇస్లాం అధ్యయనం తర్వాత నా తల్లిదండ్రులను కూడ ముస్లింలుగా చూడాలనుకున్నాను. ఈ విషయంలో వారితో తరచుగా సంభాషణ జరిగేది. కాని నేను నా లక్ష్యసాధనలో విఫలమయినందుకు విచారిస్తున్నాను. 96 ఏళ్ళ మా తండ్రి ఇంకా బ్రతికే ఉన్నాడు. మా తల్లి 1975లో పరమపదించింది.

**ప్రశ్న: ఇస్లాం ఒడిలోకి చేరాక అమెరికాలో ఎటువంటి కార్యకలాపాలు చేపట్టారు?**

**జవాబు:** ఇస్లాం స్వీకారానికి ముందు అమెరికన్ వాతావరణంలోనే వున్నప్పటికీ, ఆచరణాత్మకంగా దానిలో భాగంగా లేను. ఆ దైవరాహిత్య నాగరికత పట్ల వ్యతిరేక భావాలు ఉండేవి. అయితే ఇస్లాం పరిధిలోనికి వచ్చిన తర్వాత అమెరికన్ సొసైటితో ఈ దూరం మరింత పెరిగింది. నేను ఏ సభలో పాల్గొన్నా ఇస్లాం ప్రచారం నా ఫస్ట్ ప్రియారిటీగా వుండేది. న్యూయార్క్‌లోని జామియా మస్జిద్‌కు శుక్రవారం వెళ్ళి ఖారీ అబ్దుల్ బాసిత్ ఖుర్ఆన్ పఠనం రికార్డ్ వినేదాన్ని. ఒక రోజు ఖారీ అబ్దుల్ బాసిత్‌గారి రికార్డు

వినిపించబడలేదు. కాని జాంజిబార్‌కు చెందిన ఒక నీగ్రో విద్యార్థి సూరయె రహ్మాన్ పఠించి సభకుల్ని మంత్రముగ్ధుల్ని చేశాడు. అంతకంటే గొప్ప శ్రావ్యమయిన కంఠంతో గద్గద స్వరం నేనెన్నడూ వినలేదు. ఈ స్వరం తప్పక హజ్రత్ బిలాల్ (రజి) స్వరాన్ని పోలి వుండవచ్చు.

**ప్రశ్న: మౌలానా (రహ్మలై)తో ఎప్పుడు, ఎలా పరిచయం అయ్యింది? ఇస్లాం స్వీకరించి పాకిస్తాన్‌కు వచ్చిన తర్వాత మౌలానా కుటుంబంతో గడిపే అవకాశం కూడా చిక్కిందా? ఆ సహచర్యం గురించిన జ్ఞాపకాలను వెల్లడిస్తారా?**

**జవాబు:** నేను మౌలానా (రహ్మలై) గారితో ఉత్తరప్రత్యుత్తరాలు ప్రారంభించక మునుపు ఆయన పేరు కూడా వినలేదు. మొట్టమొదటిసారిగా 1958లో కీత్ డబ్లియు మోర్గన్ సంపాదకత్వంలో వెలువడే పుస్తకం The Straight path of Islam లోని భాగం Islam in Pakistanలో చదివాను. కాని అందులో మౌలానా గారి ప్రస్తావన ఉత్తమ రీతిలో జరగలేదు. కారణం, రాయిటర్ (వార్తాసంస్థ) ప్రకారం మౌలానా ఆధునిక వాదులకు వ్యతిరేకులు, పాకిస్తాన్‌లో ఇస్లామీయ వ్యవస్థ స్థాపించగోరుతున్నవారు కావటమే. అందుచేత ఈ పఠనం తర్వాత మౌలానా (రహ్మలై) గురించి మరింత తెలుసుకోవాలన్న ఆసక్తి కలిగింది. ఈ కాలంలోనే డర్బన్ (సౌత్ ఆఫ్రికా) నుండి వెలువడే ఇంగ్లీషు మ్యాగజైన్ 'సౌదీ డైజెస్ట్'లో మౌలానా గారి వ్యాసం ప్రచురితమయింది. దాని శీర్షిక 'Life ofter Death.' ఈ వ్యాసం ఖుద్దుగా నా భావాలకు ప్రతిరూపంగా తోచింది. నేను మ్యాగజైన్ ఎడిటర్‌కు వ్రాసి మౌలానాగారి అడ్రసు తెలుసుకున్నాను. దాని తర్వాత మౌలానాతో పరిచయం ఏర్పడింది. డిసెంబర్ 5, 1960లో నేను మార్గరెట్ మార్కోస్ పేరుతో మౌలానాకు మొట్టమొదటి ఉత్తరం వ్రాశాను. ఈ ఉత్తర ప్రత్యుత్తరాలు దాదాపు ఒకటిన్నర సంవత్సరం కొనసాగాయి. మొదటి ఉత్తరానికే జవాబుగా మౌలానా తన గ్రంథాలు, రిసాలె దీనియాత్, ఇస్లాంకా నజరియె హయాత్, ఇస్లామీ రియాసత్ ఔర్ ఇస్లాం ఔర్ ఖౌమియత్‌ల ఇంగ్లీషు అనువాదాలు పంపారు. ఈ పుస్తకాలు చదివాక, మౌలానాగారు నా భావాలనే వివరించారని

పించింది. ఈ పుస్తకాలు ఇస్లాం గురించి నా అంతరంగంలో పుట్టిన విభిన్న ప్రశ్నలు, సందేహాలకు చాలా సంతృప్తికరమయిన జవాబునిచ్చాయి.

యూదు కుటుంబంలో పుట్టి పెరిగిన నేను, అక్కడ ధర్మ రాహిత్యాన్ని ధర్మంతో కలగలిపే ప్రయత్నం చేయబడుతుండటం చూశాను. ఈ నీతి బాహ్యత, కపటత్వాల అనుభవంతో నా బాల్యం అంతా గడిచింది. కాని ఇస్లాం స్వీకరించిన తర్వాత ముస్లింలలోనూ ఇటువంటి ప్రభావాన్ని, ధర్మం పట్ల మనోవైకల్యాన్ని ప్రదర్శించడం చూసి తీవ్ర మనస్తాపం కలిగింది. దేవుని దయవలన ఈ విషయాలు నా ఉద్దేశ్యాలు, నా విశ్వాసంపై ప్రభావం చూపలేక పోయాయి. దానికి వ్యతిరేకంగా తీవ్రంగా కృషి చేయాలని నిశ్చయించుకున్నాను. అందువల్ల దీని విషయంలో 1961లో మౌలానా గారికి లేఖ వ్రాయగా మౌలానాగారు వెంటనే దానికి జవాబు వ్రాశారు.

"నేను గంభీర దృష్టితో మీ ఉత్తరాలను విశ్లేషిస్తున్నాను. నేను నా భావాలనే చదువుకుంటున్నట్లు భావించాను. మీరు మరింతగా పఠనం చేసినట్లయితే మీ భావాలు కూడా అటువంటి తరహాయే అవుతాయి. నాకూ మీకూ మొదటి నుండీ పరిచయం లేకపోయినా పరస్పర సానుభూతి, భావ స్వారూప్యతల అసలు కారణం మన మానసిక స్పందనలు ఒక్కటే అయిన ఫలితమే. అంటే 'ఇస్లాం' అన్నమాట."

ఇస్లాం బంధంలోనికి వచ్చిన తర్వాత అమెరికన్ సొసైటి నాకు ఎన్నో కష్టాలకు కారణమయ్యింది. అందుచేత 22, మార్చి 1962లో నేను మౌలానా గారికి మరో లేఖ వ్రాశాను. అందులో, "ఇంకా అమెరికన్ సమాజం లోనే వుండటం నాకు ఎట్టి పరిస్థితులలోనూ సాధ్యం కాదనీ, ఈ సొసైటిలో నేను ఇమడలేననీ, నాకే గనక ఇస్లాంపై విశ్వాసం లేకుండినట్లయితే ఎన్నో సంవత్సరాల క్రితమే ఆత్మహత్య చేసుకుని వుండేదాన్నని మనస్ఫూర్తిగా అంగీకరిస్తున్నా"నని స్పష్టంగా వ్రాశాను. అందుకు జవాబుగా మౌలానాగారు నన్ను పాకిస్తాన్‌కు రమ్మని ఆహ్వానించారు. ఇంకా దాదాపు మీ వయస్సే వున్న ఇద్దరు కుమార్తెలున్నారు. వారిద్దరూ మీకు ఫ్రెండ్స్ అయిపోతారని

భావిస్తున్నాను. వాళ్ళు మీకు ఉర్దూ భాష నేర్పుతారు. అందుకు బదులుగా మీకు నూతనంగా వచ్చిన ఇస్లాం ఉత్సాహం, తహతహ గురించి తెలిసి వస్తుంది. అందుచేత నేను పాకిస్తాన్‌కు వచ్చేశాను. వాస్తవమేమంటే మౌలానా గారి ఇంట నా హోదా ఒక కుటుంబ సభ్యురాలిగా వుంది. మౌలానా హమేషా నన్ను తన కుమార్తెలతో సమానంగా చూసుకున్నారు. ఈ గౌరవం పట్ల నేను గర్విస్తున్నాను. ఈ గొప్ప ఇంట్లో నాకు అవసరం అయిన ప్రతి వస్తువు లభించింది. విజ్ఞానాసక్తి గురించి సంతృప్తి, ఉన్నత శిక్షణ లభించింది. నేను జబ్బు పడినప్పుడు మౌలానా గారి కుటుంబం యావత్తూ నాకు చేసిన పరిచర్యల్ని నేను ఎన్నటికీ విస్మరించలేదు. ఆ తర్వాత 1963లో మౌలానా గారు నాతో సంప్రదించి నన్ను ఒక చిత్తశుద్ధిగల, జమాఅతె ఇస్లామీ, లాహోర్‌కు చెందిన సభ్యుడు ముహమ్మద్ యూసుఫ్ ఖాన్‌తో నికాహ్ జరిపించారు. ఆ కుటుంబం ఎంతో సహృదయంతో నన్ను కోడలిగా స్వీకరించింది. నేనిప్పటి వరకూ సుఖసంతోషాల జీవితం గడుపుతున్నాను. పిల్లల బాధ్యతతోపాటు ఆత్మ సంబంధమైన హాయితో రచనా వ్యాసంగాన్ని కూడా కొనసాగించాను. నా వివాహ సందర్భంగా మౌలానాగారు ఒక తండ్రివలె నాకు చేసిన ఉపదేశాల ప్రకారం ఎల్లప్పుడూ పాటిస్తూ వచ్చాను. మౌలానా గారి ఉపదేశాలు, ఆ పుణ్యశీలుర కుటుంబంలోని పవిత్ర ఆచారాల ఫలితం నాకు లభించిన ఈ ప్రశాంత జీవితం అని భావిస్తున్నాను. ఈ సంతృప్తికర జీవితం ఫలితంగా నాకు పాకిస్తాన్‌కు రావడానికి తీసుకున్న నిర్ణయంపై ఎన్నడూ విచారమూ కలుగలేదు. అమెరికాలోని కుటుంబ సభ్యులను కలుసుకోవాలన్న కోరికా కలుగలేదు.

**ప్రశ్న: మీ దృష్టిలో ప్రస్తుత ప్రపంచవ్యాప్త ఇస్లాం మీ ప్రభంజనంలో మౌలానా మౌదూదీ (రహ్మలై)గారి ఆలోచన, కృషి ఎంతవరకు వుంది?**

**జవాబు:** ప్రస్తుత యుగంలో మౌలానాను మించి ఇస్లాంకు సేవ చేసే వారెవరూ నాకు కనబడలేదు. అయన ధార్మిక విద్వాంసుడే కాక, గొప్ప నాయకుడు, ఆలోచనాపరుడు, ఇస్లామీయ రాజ్యాన్ని ఆచరణాత్మకంగా స్థాపించడంలో కృషి చేసినవారు కూడాను. ఆయన కృషి, అయ్యూబ్

ఖాన్, భుట్టోల వంటి నియంతల పతనానికి కారణమయ్యింది. ఆయన పాకిస్తాన్‌లో ఇస్లామీయ రాజ్య రూపురేఖల్ని తన జీవితకాలంలోనే కళ్ళారా చూసిన అదృష్టశాలి. ఆయన తనను తాను బోధనలు, ఉపదేశాలకు, సిద్ధాంతాల ప్రచారం వరకు పరిమితం చేసుకోలేదు. ఆచరణాత్మకంగా జమాఅతె ఇస్లామీ స్థాపకుడు మరియు అమీరు హోదాలో ఇస్లామీయ రాజ్యం కోసం అహర్నిశలూ కృషి సల్పారు. ఇస్లామీయ సిద్ధాంతాల పరిరక్షణ ఎంత గొప్పగా చేశారంటే, ప్రాపంచిక సుఖాలనేకాక తన ప్రాణం కూడా త్యాగం చేయడానికి సిద్ధపడ్డారు. ఆయన సత్యధర్మయోధుల వలె ప్రభుత్వ అధికార్ల దుశ్చర్యలను ఎండగట్టారు. ఆయన తయారు చేసిన జమాఅత్ ధర్మరాహిత్యం భౌతిక ప్రియత్వాలకు వ్యతిరేకంగా కోటగోడలా పనిచేశారు. ఆయన చాలా సంపన్న జీవితం అనుభవించగలిగే స్థితిలో వున్నప్పటికీ ఏనాడూ అటువంటి జీవితాన్ని ఆశించలేదు. ఆయన చాలా మృదు స్వభావి. అహంకారానికి ఆమడ దూరం వుండేవారు. ఆయన వ్యక్తిత్వం నిరాడంబరత్వానికి ప్రతీక. వ్యక్తిగత పేరుప్రతిష్ఠల కోసం మెప్పులూ మెహర్బానీల కోసం వెంపర్లాడ లేదు. ముఖస్తుతి ఆయనకు గిట్టదు. వాస్తవంలో ఆయనకు నిజమైన దైవదాసుడు కావాలన్న కోరిక తప్ప మరే ఆసక్తీ లేదు. కోరికా లేదు. ఆయన కేవలం అల్లాహ్‌కు భయపడేవారు. ప్రభుత్వనేతల తప్పిదాలకు వారిని బహిరంగంగా అడ్డుకునేవారు. పలుమార్లు కారాగారాల సంకటాలను అనుభవించారు. జమాఅత్‌ను నిషేధించడం జరిగింది. ఆయన ప్రాణాలు తీసే ప్రయత్నమూ జరిగింది. మరణశిక్ష వినిపించడం కూడా జరిగింది. గూండాల ద్వారా నిండు సభలో గుళ్ళ వర్షం కురిపించబడింది. ప్రతి పరీక్షలోనూ నెగ్గుకొచ్చారు. అత్యంత బలవంతుడయిన వాడు కూడా ఆయన్ని లొంగదీసుకోలేకపోయాడు. తన ఆ దాసుడి ప్రతి కష్టంలోనూ అల్లాహ్ సహాయపడ్డాడు. ఆ నిలకడతో కూడిన కృషి ప్రభావంగా ఆయన పుస్తకాలు ప్రపంచ వ్యాప్తం అవుతూ వచ్చాయి. అఫ్ఘానిస్తాన్ నుండి ఆక్రమిత కశ్మీర్ వరకూ ముజాహిద్‌లు మౌలానాగారి ఆలోచనా విధానాన్ని తమలో ఇముడ్చుకుని వున్నారు. మౌలానా గారి లిటరేచర్ యువతరాన్ని ఇస్లాం సేవకు పురిగొల్పింది. ఇక ఇప్పుడు

ఇస్లాం ప్రపంచ వ్యవస్థ జీవిత రంగా లన్నింటిపై ఆవరించి వుంది. ప్రస్తుత నైతిక చెడుగులకు పరిష్కారం ఇస్లాం మాత్రమే అన్న విషయం ప్రజామోదం పొందసాగింది.

ముస్లింలందరికీ నా విజ్ఞప్తి ఏమంటే వారు మౌలానా గారి ఉదాహరణను ముందువుంచుకోవాలి. ఆయన తన యావజ్జీవితం ధన, ప్రాణాల్ని, సమయాన్ని త్యాగం చేసి ఇస్లామీయ ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్ళిన విషయాన్ని దృష్టిలో వుంచుకోవాలి. పాకిస్తాన్‌లో ఇస్లామీయ ఉద్యమం ప్రస్తుతం వెల్లివిరియడానికి, మౌలానా మౌదూదీ (రహ్మలై) జరిపిన కృషి మాత్రమే కారణభూతమన్నది వాస్తవం.

**ప్రశ్న: మౌలానా మౌదూదీ (రహ్మలై) మీకు పాకిస్తాన్‌లో గొప్ప ఆధ్యాత్మిక ఆధారమయ్యారు. ఆయన ఆహ్వానంపైనే మీరు పాకిస్తాన్‌కు వచ్చారు. ఆ తర్వాత మీరు ఆయన సలహాలూ, మార్గదర్శకత్వంతోనే మీ జీవితంలో అనేక ముఖ్య నిర్ణయాలు తీసుకున్నారు. మరి మౌలానాగారి వియోగం తర్వాత మీ భావనలేమిటో చెబుతారా?**

**జవాబు:** మౌలానా గారి మరణ వార్త విన్న వెంటనే నా తలపై నుండి ఒక వాత్సల్యపూరిత హస్తం తొలగిపోయిన భావన కలిగింది. నాకు పాకిస్తాన్‌లో సర్వం సమకూర్చిన సంరక్షకుడ్ని కోల్పోయాను. ఇస్లామీయ ప్రపంచం, వర్తమాన యుగంలోని మహా నాయకుడ్ని, ధార్మికవేత్తని కోల్పోయింది. ఇది భర్తీ చేయలేని లోటు.

మౌలానా మౌదూదీ చివరి దశలో బాగా వృద్ధులయిపోయారు. మనసులో ఆయన జీవితం గురించి పెద్ద అనుమానాలు చోటుచేసుకో సాగాయి. ఆయనకు వచ్చిన జబ్బు వృద్ధాప్యపు రోగం. దానికి చికిత్స అంటూ లేదు. ఆయన నాకు ఆత్మీయుడయిన తండ్రి వంటివారు. ఆయనకు నాపై హమేషా అంతులేని వాత్సల్యం వుండేది. కాని ఆయన్ని అమెరికాకు వెళ్ళకుండా ఆపడం, నా వశంలో లేని పని. ఆయన వెళ్ళడాన్ని నేను వ్యతిరేకిస్తున్నాను. ఆయనకు ఆరోగ్యం కలిగించగల డాక్టరు అమెరికాలో ఎవరూ లేరు. ఆయన జీవితంలోని అంతిమ క్షణాలు పాకిస్తాన్‌లోనే గడిచివుంటే బాగుండేది.

**ప్రశ్న: ఇస్లామీయ సందేశం విషయంలో ఇప్పటి వరకు మీ కార్య కలాపాలు ఏమిటి? గృహసంబంధ వ్యవహారాల వైనం ఏమిటి?**

**జవాబు:** ఇప్పటి వరకూ నేను ఎక్కువ కాలం ఏకాంతంగానే గడిపాను. ఆరంభంలో పిల్లల పెంపకంతోపాటు, రచనా వ్యాసంగంలో గడిపేదాన్ని. ఇప్పుడయితే పఠనం, వ్రాత పని పెరిగిపోయింది. కాబట్టి ఇతరులను కలుసుకొనే అవకాశాలు తక్కువగానే వుంటాయి. నేనిప్పటి వరకూ, పుస్తకాల రూపంలో వున్న సేవనే చేయగలిగాను. ఈ పుస్తకాలు ఇంగ్లీషులోనే వున్నాయి. అయితే కొన్నింటి ఉర్దూ అనువాదాలు జరిగాయి. సమయం చాలా విలువయిన ఆస్తి. దాన్ని నేను రేడియో, టి.వి.లపై ఎన్నడూ వ్యర్థం చేయను. నేనిక్కడికి వచ్చి 30 ఏళ్ళయింది. కాని ఎన్నడూ సినిమా హాస్‌లకు పోలేదు. సినిమాని వినోదం లేక షికారుగా వెళ్ళడం అని పేరు పెట్టేవారి ధోరణి సరికాదు. నా దృష్టిలో అది సమయాన్ని వృధా చేయడం, ధర్మ రాహిత్యం తప్ప మరేమీ కాదు. తన పిల్లల దగ్గర తప్ప ఒక తల్లికి సరదా కాలక్షేపం కాగలదా? ఒకానొకప్పుడు నేను ఆర్ట్ పట్ల వ్యామోహం కలిగి వుండేదాన్ని. బాబ్డ్ హెయిర్ వుండేది. ఇస్లాంలోకి వచ్చాక అన్నీ మానుకున్నాను. ఇప్పుడు ఇతరుల కళ్ళు నాపై పడకూడదని నిరాడంబరత్వాన్ని అలవర్చుకున్నాను.

**ప్రశ్న: యూదత్వంతో మీకు వంశపరమైన సంబంధం ఉంది. ఇంకా మీరు ఆ మతం బాగా చదివి వున్నారు. అందువల్ల మీరు యూదత్వ రహస్యాలు, సూచనలు ఎరిగి వున్నారు. యూదుల ఇస్లాం ద్వేషాన్ని ఎలా ఎదుర్కోవాలో సూచిస్తారా?**

**జవాబు:** యూదులను ఎదుర్కోవడానికి ఉత్తమ ఆయుధం జిహాద్ మాత్రమే. యూదులు శాంతియుత మార్గాలతో దిగిరారు. ఆ మార్గాల ద్వారా ఒక్క అంగుళం కూడా కదలరు. ఇప్పుడు కూడా ఖుద్దుగా ముస్లింల తరఫున కూడా శాంతి ప్రదర్శనలకు ఆమోదం కనబర్చబడుతోంది. కాని ఇలా చేసేటప్పుడు యూదుల చరిత్రను ఎలా విస్మరించగలం అని నేనంటున్నాను. ఎప్పటి మాదిరిగానే వారు నేటికీ ఇస్లాంను అంతం చేయాలనుకుంటున్నారు.

ప్రపంచంలో ఒక్క ముస్లిం అయినా బ్రతికి వుంటే యూదత్వ ఉనికే ప్రమాదంలో పడుతుందని వారు భావిస్తున్నారు. పైగా వారు పవిత్ర స్థలాలు (మక్కా, మదీనా) నుండి ముస్లింలను పారద్రోలి వాటిని కూడా ఆక్రమించ గలమన్న ఆశాభావంతో వున్నారు. ఇప్పుడు యూదుల సంకల్పాలను టేబుల్‌పైకాక యుద్ధరంగంలో జరుగగలదన్న విషయాన్ని ఎంత మాత్రం విస్మరించకూడదు.

నా దృష్టిలో యూదులను, ఇఖ్వానుల్ ముస్లిమీన్ ఇంకా ఆ సంస్థతో భావసారూప్యంగల 'హమస్' మాత్రమే ఎదుర్కోగలవు. ప్రయోజనకర చర్చ దానికి ఉత్తమ ప్రారంభం. పాలస్తీనా జిహాద్ ఉద్యమంలో పాలుపంచు కుంటున్న ముజాహిద్‌లకు, సాధ్యమయిన అన్ని విధాల సహాయం చేయ వలసిందిగా ప్రత్యేకించి అరబ్బులను కోరుతున్నాను. ఇస్లామీయ ప్రపంచ ఉనికి, దాని భద్రత ఈ పరస్పర ఐకమత్యంలోనే ఇమిడి వుంది. ఈ సందర్భంగా అంతర్జాతీయ ఇస్లామీయ సైన్యం రూపొందించబడాలి. ఇస్లామీయ ప్రపంచం తన కాళ్ళమీద నిలబడగలగాలి. ముస్లిమేతరులకు దాసోహం అయ్యే జాలం నుండి వెనువెంటనే బయటపడాలి. ఈ అగత్యం, రాజకీయ పరమైనదైనా, ఆర్థిక, విద్యా, సాహిత్యపరమైనదైనా ఎంతో ప్రమాదకారి. మరోవైపు జాతిపరమైన నినాదాలు మనల్ని అన్నిచోట్ల విభేదాలలో విభ జించాయి. మనం ఇస్లాం ప్రసాదించిన ఐకమత్యాన్ని విస్మరించాం. దానికి పరిష్కారం ప్రపంచ ఇస్లామీయ పాలకులు ఐకమత్యం అనే పదాన్ని కేవలం ఇస్లాంకు మాత్రమే వర్తింపచేయాలి. జాతీయతకు కాదు. వాస్తవానికి పాశ్చాత్య ప్రసారసాధనాల ప్రాపగండా కారణంగా మనలో చీలికలువున్నాయి. మనం ఈ ప్రాపగండాకు విరుగుడు కోసం ముందుకు రావాలి. ఇంకా మరో అడుగు ముందుకువేసి స్వయంగా ఇస్లాం వ్యతిరేక శక్తులయిన యూదత్వం, క్రైస్తవాలలో విభేదాలను పెంచాలి. మనం యూదత్వం తలపై నుండి క్రైస్తవం నీడను ఎలాగయినా అంతం చేయవలసి వుంటుంది.

ప్రశ్న: ఇస్లాంలో స్త్రీకి స్వాతంత్ర్యం లేదని స్త్రీలు స్వయంగా పోరాటం